విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

99492 22450

ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
13-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 192

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# హర్మోజ్ జలసంధి మూసే ఉంచుతాం



- అమెరికాపై ప్రతీకార దాడులు ఆగవు
- పొరుగుదేశాలు అమెరికా స్థావరాలు మూసేయాలి
- ఇరాన్ కొత్తనేత మొజ్తబా ఖమేనీ తొలి ప్రకటన
- ప్రసారం చేసిన ఇరాన్ టెలివిజన్
- యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే
- అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు





**టెహ్రాన్, ప్రభాత సూర్య :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన వేళ ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సంచలన ప్రకటన విడుదల చేశారు. హోర్ముజ్ జలసంధిని మూసే ఉంచుతామని అన్నారు. హోర్ముజ్ జలసంధి మూసివేతను తన తండ్రి అయతొల్లా అల్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా-ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెంచే చర్యగా అభివర్ణించారు. ఆయన ప్రకటనను ఇరాన్ టెలివిజన్ ప్రసారం చేసింది. మొజ్తాబా మాత్రం కెమెరా ముందుకు రాలేదు. ఇరాన్ సుప్రీం నేతగా ఎన్నికైన తర్వాత ఆయన అధికారిక ప్రకటన విడుదల చేయడం ఇదే మొదటిసారి.

మధ్యప్రాచ్యంలో శత్రులక్ష్యాలపై దాడులు

2లో



## గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

- హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం
- ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత
- ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి
- బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు

5లో



## 14నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి

హైదరాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై..

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

- కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్
- లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్
- హాజరైన సినీ, రాజకీయ దిగ్గజనేతలు
- ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి
- ఫ్యూచర్‌సిటీలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన



2లో



## పెరుగుతున్న ఎండల తీవ్రత

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మరింత వేడెక్కిస్తున్నాయి.

2లో

## అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

గెలిచే వరకే రాజకీయాలు.. తరవాత అభివృద్ధి

ప్రజాప్రతినిధులకు మంత్రి పొంగులేటి హితవు



## ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణాకు ఐకాన్

### 1000 కోట్లతో అభివృద్ధికీ రూట్ మ్యాప్

- నిధులు మంజూరు చేయడం అభినందనీయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ధన్యవాదాలు

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

2లో

## దేశంలో గ్యాస్ సంక్షోభం



- కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ
- పరిస్థితులపై అధికారుల సమీక్ష..
- గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన
- పార్లమెంటు నుంచి బయటకు చేరిన నిరసనలు
- మకరద్వారం ముందు విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన

### త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో

## పోలీస్ శాఖ పాత్ర కీలకం

- పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ప్రభాత సూర్య :** 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో

2లో

# హార్మోజ్ జలసంధి మూసే ఉంచుతాం

కొనసాగిస్తామని కూడా మొజ్తాబా హెచ్చరించారు. అమెరికా స్థావరాలను మూసివేయాలని ఆయా దేశాలకు పిలుపునిచ్చారు. లేనిపక్షంలో దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ప్రజలు చిందించిన రక్తం, ముఖ్యంగా మినాబ్‌లో జరిగిన పాఠశాల బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలకు ప్రతీకారం తీర్చుకునే విషయంలో వెనుకంజ వేసేది లేదన్నారు. యుద్ధంలో శత్రువులు కలిగించిన నష్టానికి ఇరాన్ పరిహారం కోరుతోందని మొజ్తాబా అన్నారు. పరిహారం చెల్లించని పక్షంలో అంతే మొత్తాన్ని వాళ్ల ఆస్తుల నుంచి తీసుకుంటుందని, అది సాధ్యం కాకుంటే అంతే మొత్తంలో ఆస్తులకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత కష్టకాలంలో దేశంలోని ప్రజలు, సంస్థలు కలిసికట్టుగా ఉండాలని, అమెరికా చెబుతున్న అబద్ధాలను తిప్పికొట్టాలని, జాతీయ సమైక్యతను చాటుకోవాలని కోరారు. ఇరాన్ అమరవీరుల ప్రతీకారం తీర్చుకుంటామని మెజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలను మూసివేయాలని పిలుపునిచ్చారు.గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో అమెరికా, హార్ముజ్ జలసంధిపై కఠినమైన వైఖరిని ప్రస్తావించారు. 'ఈ ప్రాంతంలోని అన్ని అమెరికా స్థావరాలను వెంటనే మూసివేయాలి, లేకపోతే వాటిపై దాడి కొనసాగుతుంది' అని హెచ్చరించారు. కాగా, దాడుల్లో గాయపడి ఇప్పటి వరకు బయటకు కనిపించని సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ఒక ప్రెజెంటర్ వినిపించారు. హార్ముజ్ జలసంధి మూసివేత కొనసాగించాలని ఒక లెవరేజ్ సాధనంగా అది ఉండాలని ఆయన అన్నారు. పొరుగు దేశాల పట్ల ఇరాన్ విధానం సహకారంగా ఉంటుందని చెప్పడానికి ప్రయత్నించారు. 'ప్రాంతీయ దేశాలతో స్నేహపూర్వక

సంబంధాలకు ఇరాన్ మద్దతు ఇస్తుంది. కానీ అమెరికన్ దళాలకు ఆతిథ్యం ఇవ్వకుండా వారిని హెచ్చరిస్తుంది' అని పేర్కొన్నారు.మరోవైపు ఇరానియన్ల రక్తానికి ప్రతీకారం తీర్చుకోవడానికి తాము వెనుకాడబోమని మోజ్తాబా ఖమేనీ స్పష్టం చేశారు. స్కూల్‌పై క్షిపణి దాడిలో సుమారు 110 మంది పిల్లలతో సహా168 మంది మరణించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పోరాటాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే లెబనాన్, ఇరాక్, యెమెన్‌తో సహా ఈ ప్రాంతంలోని మిత్ర సాయుధ సమూహాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో



ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ హతమయ్యారు. ఈ దాడుల్లో గాయపడిన ఆయన కుమారుడైన మోజ్తాబా ఖమేనీ తన తండ్రి అధికారాన్ని దక్కించుకున్నారు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ పూర్తిగా ఆపేయాలన్నారు.

## అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

ఖమ్మం: ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల వరకే రాజకీయాలని.. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరూ ప్రజలకు మంచి చేసే ప్రజా ప్రతినిధులేనని పేర్కొన్నారు. మంచి కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక శిక్షణా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.తమ ప్రభుత్వం 6 తేదీ నుంచి 99 రోజుల పాటు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక రూపొందించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సర్పంచ్‌గా ఆ వ్యక్తి ఉంటే గ్రామం అభివృద్ధి జరిగిందని చెప్పుకునేలా పని చేయాలని దిశానిర్దేశర చేశారు. అధికారులు కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లు వారు ఉన్నప్పుడు మంచి పనులు జరిగాయని ప్రజలు చెప్పుకోవాలన్నారు. ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత, ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యత మనపై ఉందని చెప్పుకొచ్చారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ వచ్చిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో నిధులు వచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. మార్చి 31వ తేదీ లోపు అభివృద్ధి పనుల కోసం నిధులు మళ్లీ వస్తాయని.. వచ్చిన నిధులను ప్రణాళికబద్ధంగా, ప్రజలకు ఉపయోగపడేలాగా వినియోగించాలని మార్గనిర్దేశర చేశారు. సర్పంచ్‌లకు మునుపే ట్రైనింగ్ ఇచ్చారని, వారి విధులు ఏంటి, మీరు ఎలా పని చేయాలనే విషయాలు ఇప్పటికే అర్థమై ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వేసవిలో తాగునీరు సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని ఆదేశించారు. ఏ గ్రామ పంచాయతీకి అత్యధిక నిధులు వచ్చాయో ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య భాగస్వామ్యం అయ్యేలా పని చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దిశానిర్దేశర చేశారు.

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

హైదరాబాద్: నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్‌ఆర్‌ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

## త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కనుసన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

## ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణకు ఐకాన్

(మొదటి పేజీ తరువాయి)

1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు.అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికీ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు.అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అని అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని,అంతే గాకుండా గల్లీ నుండి డిల్లో స్థాయికి ఎదిగిన నేతలు,క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాధ్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు.

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్కాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

## దేశంలో గ్యాస్ సంక్షోభం

న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ): పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. నల్లబజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నా మని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి. ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయి' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది. 'మోడీజి -ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమరిషయల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోడీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోడీజి, ఎల్‌పిజి' అంటూ నినాదాలు చేశారు. ప్రియాంక వాద్రా గాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు.

## పెరుగుతున్న ఎండల తీవ్రత

ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. రాయలసీమ, గోదావరి జిల్లాల్లో ఎండలు తీవ్రం అవుతున్నాయి. తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరంలో కూడా ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి భగభగలతో నగర ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే.. ముందు ముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, బయటికి రాకుండా చూసుకోవాలి. రోజుకు తప్పని సరిగా నాలుగు లీటర్ల నీరు తాగితే డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా పలుచని నూలు వస్త్రాలు ధరింపజేయాలి.ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అతి ముఖ్యమైన పని ఉంటేనే బయటకు వస్తున్నారు.

# పేదల ప్రజల ఇండ్ల జోలికొస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతాం



**ఆలేరు మార్చి 12(ప్రభాత సూర్య):** తెలంగాణ రాష్ట్రంలోనీ పేద ప్రజల ఇండ్ల జోలికి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతామని బిజెపి ఆలేరు మండల, పట్టణ అధ్యక్షుడు పూజారి కుమార స్వామి నంద గంగేష్ లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం ఆలేరు పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నిరంకుశ పాలన చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలుగా పేద ప్రజలనే టార్గెట్ చేస్తూ మూసి సుందరి కరణ, హైడ్రా అంటూ పేద ప్రజల ఇండ్లను కూల్చి వారిని రోడ్డుపై పడేశారు. ఇప్పుడు నిషేధిత జాబితా( పి ఓ టి )అంటూ పేద ప్రజల ఇండ్లను కూల్చే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఎన్నో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిషేధిత ఇండ్ల జాబితా గురించి ప్రజలకు తెలపకుండా బిజెపి ఎతీం చీకటి ఒప్పందాలంటూ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా కార్యదర్శి కామటికారి కృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ చిరిగే శ్రీనివాస్ లు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు కడుతున్న లబ్ధిదారులకు సరిగా బిల్లులు రాక మధ్యలోనే నిలిపివేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఇండ్ల జోలికి వస్తే బిజెపి పార్టీ పేద ప్రజలకు అండగా ఉండి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఇండ్ల నిషేధిత జాబితా విడుదల చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విషయాన్ని మభ్యపెడుతూ స్థానిక ఎమ్మెల్యే బీజేపీపై బూరద చెల్లె ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి ఆరోపణ చేస్తే భయపడేది లేదని ఇండ్ల జోలికి వస్తే గ్రామాల్లో ఎమ్మెల్యేని బిజెపి నాయకులు ప్రజలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ నెంబర్ వడ్డేమాన్ నరేందర్ ప్రధాన కార్యదర్శి సుంకరి సృజన్ జిల్లా నాయకులు తునికి దశరథ మండల కార్యదర్శి బైరి మహేందర్ వడ్డేపల్లి కిషన్ తదితరులున్నారు.

## ఆలేరు లో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య

**ఆలేరు, మార్చి 12:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ఓ యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ కాప్రా నివాసి చిన్నం స్వప్న (40), ఆర్టీసీ కండక్టర్, తన తమ్ముడు చిన్నం రమేష్ (32), డ్రైవర్, ఆలేరు పట్టణంలోని పోచమ్మవాడలో నివసిస్తున్నాడు. నిన్న రాత్రి చిన్నరామచర్ల గ్రామంలో తన బావమరిది భాస్కర్ వివాహ కార్యక్రమానికి రమేష్ హాజరయ్యాడు. హల్దీ కార్యక్రమం అనంతరం రాత్రి సుమారు 12:30 గంటల సమయంలో ఒంటరిగా ఆలేరు ఇంటికి తిరిగి వచ్చాడు. అయితే ఈ ఉదయం నుంచి రమేష్ ఫోన్ ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. పొరుగువారు ఇంటి కిటికీ ద్వారా చూడగా, రమేష్ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. రమేష్‌కు కుటుంబ సమస్యలు ఉండటంతో మానసికంగా బాధపడుతున్నాడని అతని అక్క స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## పురపాలక పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఇంజనీర్ ఇన్ చీఫ్ భాస్కర్ రెడ్డి



మిర్యాలగూడ మార్చి 22:- (ప్రభాత సూర్య ): మిర్యాలగూడ పురపాలక పరిధిలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, అమృత్ నీటి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను పురపాలక శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ భాస్కర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ కందుకూరు వెంకటేశ్వర్లుతో కలిసి పట్టణంలో ఆకస్మికంగా పర్యటించారు. తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భూగర్భ డ్రైనేజ్ వ్యర్థపూ నీటి శుద్ధి ప్లాంట్ -1 , రాంనగర్ బంధం డంపింగ్ యార్డ్ పక్కన ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యర్థపు నీటి శుద్ధి ప్లాంట్ 2 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం గురించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న ఉపరితల నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు స్థానిక అధికారులు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ కందుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడు తూ సాధ్యమైనంత తొందరగా భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేసి ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాళ్లగడ్డ వద్ద అదనంగా మరో శుద్ధి ప్లాంటును నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డిఇఇ కె.వెంకన్న, ఎఇఇలు నవీన్, అంజలి, ప్రజారోగ్య శాఖ ఏఈ సాయితేజలున్నారు.




## విరామమెరుగని విప్లవ వీరుడు కామ్రేడ్ విక్రం....

**ఆలేరు మార్చి 12 ప్రతిభ సూర్య :** ఆలేరు మున్సిపాలిటీలో సిపిఐ(ఎంఎల్ ) ఎన్డీఆర్ కార్యాలయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మందడి సత్తిరెడ్డి(విక్రమ్) 33వ వర్ధంతి ఏ ఐ కే ఎం స్ మండల అధ్యక్షుడు కే రాజయ్య అధ్యక్షతన నిర్వహించారు .కామ్రేడ్ విక్రం చిత్రపటానికి ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు పి అంజయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వి బాలమల్లేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం,ప్రజా జీవితమే తన జీవితంగా పనిచేస్తున్న కామ్రేడ్ విక్రమ్ ను విప్లవం అనే ముసుగులో అతివాదం తలకెక్కిన అరాచకరాడికల్స్ 1993 మార్చి 12వ తేదీన తుపాకులతో కాల్చి గొడ్డలితో అతి కిరాతకంగా నరికి చంపారని అన్నారు.విక్రమ్ ను చంపిన అరాచకులు కాలగర్భంలో కలిసిపోయారు.ప్రజల కోసం పోరాటం చేసిన విక్రం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ పి వరలక్ష్మి,పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు పి రవి, పార్టీ ప్రజాసంఘాల నాయకులు బి మల్లయ్య,ఏ జ్యోతి,పి సునీల్,బి చంద్రయ్య, కే మార్కయ్య,కే యాదగిరి,ఎస్ నర్సయ్య,ఏ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ పట్టణంలో 12 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

### 2,840 మంది పరీక్ష రాసే విద్యార్థులు



**మిర్యాలగూడ మార్చి 12:- (ప్రభాత సూర్య) :** ఈ నెల 14నుండి ప్రారంభం అయ్యే ఎస్ఎస్సి పరీక్షలకు విద్యార్థులకు పట్టణంలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల విద్యాధికారి డి.ధర్మానాయక్ తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సి భావనంలో విలేఖరులతో మాట్లాడుతూ మండలం, పట్టణానికి చెందిన 2,840 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. నాలుగు ప్రభుత్వ పాఠశాలలో, 8 ప్రైవేట్ పాఠశాలల భవనాల్లో నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. రెవిన్యూ అధికారులు, సిబ్బందితో సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందని ఆ శాఖ అధికారులే నియమిస్తారని ఆయన తెలిపారు. అదేవిధంగా జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ కూడ కూడ తనిఖీ చేస్తారని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాధమిక వైద్య సహాయ శిబిరం ఉంటుందని, వేసవి కాలం ఉన్నందున ఓఆర్ఎస్ పాకెట్లు ఉంటాయన్నారు. అదేవిధంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షలకు 2 సెట్ల ప్రశ్నపత్రాలు వచ్చాయన్నారు.

## పై అమెరికా ఇజ్రాయిల్ సామ్రాజ్యవాద దాడిని ప్రతిఘటించండి

**సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి**

అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాద దాడిని ప్రజలంతా వ్యతిరేకించాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ మండలం లంకెలపాలెం జాతీయ రహదారిపై యుద్ధ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ ఇరాన్ పై ట్రంప్ చేస్తున్న దాడులు అత్యధిక మంది అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. ఇరాన్ పై ఇజ్రాయిల్ , అమెరికాల సామ్రాజ్యవాద దాడిని ఖండించని కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని గని శెట్టి తప్పు పట్టారు. ఇరాన్ మన దేశానికి చిరకాల మిత్ర దేశం. మనకు అవసరమైన మూడు చమురులో అత్యధిక ఈ దేశం నుండి సరఫరా అవుతుంది. అలాంటి దేశంపై జరుగుతున్న ఈ క్రూర దాడులను కనీసం కేంద్ర బిజెపి ప్రభుత్వం ఖండించకపోవడం అమెరికా, ఇజ్రాయిల్ నేతలతో కేంద్ర బిజెపి పెద్దలకు ప్రభుత్వానికి ఉన్న కార్పొరేట్ అనుకూల. మతతత్వ అనుబంధం ప్రధానమైనదిగా కనబడుతుంది అని గని శెట్టి అన్నారు.అమెరికా యుధన్మాదాన్ని నిరసించాలని అన్నారు. యుద్ధం వద్దు శాంతి కావాలి అని నినాదాలు చేశారు.

అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనంలో భాగంగా గత పది రోజులుగా ఇజ్రాయిల్ తో కలిసి అమెరికా ఇరాన్ పై చేస్తున్న యుద్ధం కారణంగా ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా భారతదేశంలో ప్రజలు కు తీవ్ర నష్టం కలుగుతుంది అన్నారు, వెంటనే యుద్ధాన్ని ఆపాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ ధరలను కేంద్ర బి జె పి ప్రభుత్వం పెంచిందని, మనదేశంలో హోటల్స్ సంక్షోభంలో చిక్కుకున్నాయి. కమర్షియల్ గ్యాస్ ధరలను భారీగా పెంచగా, క్షేత్రస్థాయిలో పిచ్చలవిడిగా జరుగుతున్న బ్లాక్ మార్కెటింగ్ తో హోటల్ యజమానులు దిక్కుతోచని పరిస్థితుల్లో చిక్కుకున్నారు. చిన్న హోటల్ రోడ్డు పక్కన బళ్ళు పై వ్యాపారాలు చేసుకునే వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలకు ఈ యుద్ధం అవకాశం ఇస్తుందని గని శెట్టి అన్నారు. చమురు నిక్షేపాల కోసం అమెరికా పన్నుతున్న కుట్రలను ప్రపంచ దేశాల్లో వ్యతిరేకిస్తున్నాయని, దేశంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం మౌనం వహించి పరోక్షంగా ఇజ్రాయిల్ కు సహకరిస్తోందన్నారు. యుద్ధంలో అమెరికా ఇరాన్ లో ఆసుపత్రిలు, పాఠశాలలపై బాంబుల వర్షంతో పసిపిల్లల ప్రాణాలు పోతున్నాయని అన్నారు. విశాఖపట్నంలో జరిగిన ఐ ఎఫ్ ఆర్ కి వచ్చి వెనక్కి వెళ్తున్న నౌకపై అమెరికా దాడి చేసి 100 మంది ఇరాన్ సైనికులను శ్రీలంక సముద్ర జలాల్లో హత్య గావించింది అని గని శెట్టి అన్నారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మారే చర్యలు విడనాడాలని గని శెట్టి డిమాండ్ చేశారు.

## మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఉద్యమాలకు సిద్ధం కావాలి

### ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపు

**భువనగిరి, మార్చి 12(ప్రభాత సూర్య):** మహిళల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ మహిళలకు అండగా ఉంటూ ముందుండి పోరాడుతుంది అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అని, మహిళల సమస్యల పరిష్కారానికి మహిళలందరూ ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డి గ్రామంలో ఐద్వా గ్రామ మహాసభ కొండ హైమావతి అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనురాధ పాల్గొని మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 1981 సంవత్సరంలో మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం, హింసకు వ్యతిరేకంగా ఏర్పడి మహిళల హక్కుల పైన పోరాడి అనేక విజయాలు సాధించిందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం కోసం, విద్య కూడా మహిళలకు అందించాలని, బాల్య వివాహాలు నిషేధించాలని, పురుషులతో పాటు స్త్రీలకు ఆస్తి హక్కు ఉండాలని, వరకట్నం వేధింపుల నిరోధక చట్టం ఉండాలని, గృహహింస నిరోధక చట్టం ఉండాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ఉండాలని, మహిళా కమిషన్లు ఏర్పాటు చేయాలని పోరాడి ఐద్వా విజయం సాధించింది అన్నారు. మహిళల సమస్యలే సంఘం సమస్యలుగా భావించి వారి తరఫున నిరంతరం పోరాడుతున్నది ఐద్వా సంఘమని తెలిపారు.



బిజెపి పాలనలో రోజురోజుకు మహిళల మీద దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా మహిళలందరూ పోరాటాలకు, ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వము రోజురోజుకు ప్రజల పైన భారాలు మోపుతూ నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతూ పోవడం వల్ల పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో గ్యాస్ ధర పెద్ద ఎత్తున పెంచడం చాలా దారుణమని అన్నారు. ధరలు పెరగడం వల్ల ప్రధానంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధర, నిత్యవసర వస్తువుల ధరను తగ్గించాలని వారు డిమాండ్ చేసినారు. అనంతరం 16 మందితో నూతన ఐద్వా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎడ్ల జ్యోతి, కార్యదర్శిగా కొండ హైమావతి, కోశాధికారిగా కొండమడుగు కావ్య, ఉపాధ్యక్షురాలుగా కొండమడుగు లక్ష్మీ, పిన్నింటి హేమలత, సహాయ కార్యదర్శులుగా మెరుగు మహేశ్వరి, బొల్లెపల్లి భాను కమిటీ సభ్యులుగా ఎడ్ల రామలీల, కొండ సుజాత, ఆకారం తులసమ్మ, కొండమడుగు మమత, కొండ మంగమ్మ, బొజ్జ లక్ష్మి, బబ్బురి ఉపేంద్ర, మెరుగు సుశీల, బొజ్జ అలివేలు ఎన్నికైనారు.



## అక్రమ ఇసుక డంప్ స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు..

**ఆలేరు మార్చి 12 ప్రతిభ సూర్య:** ఆలేరు మండలంలోని సాయిగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను గురువారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి ఇసుకను తరలించి నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అభివృద్ధి పనుల పేరుతో సాయిగూడెం వాగు నుంచి సుమారు 60 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తవ్వి ఒకచోట డంప్ చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై స్పందించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సహకారంతో ఆ ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక తరలింపుకు ఎలాంటి అధికారిక అనుమతులు లేకపోవడంతో డంప్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా వాగుల నుంచి ఇసుకను తవ్వడం పర్యావరణానికి హానికరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా ఇసుక తవ్వకం లేదా నిల్వ జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అక్రమ ఇసుక రవాణా, నిల్వలను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

## అక్రమ మద్యం పై మర్రిగూడ ఎస్ఐ ఉక్కు పాదం



**మర్రిగూడ మార్చి 12 ప్రభాత సూర్య :** మర్రిగూడ మండలంలో అజ్జలపురం గ్రామ లోఅక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపుల్లో మర్రిగూడ ఎస్సై మునగాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించి, కాపర్తి అంజయ్య ఇంటిలో 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగింది మండలంలో ఎవరైనా సరే అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవి అని ఎస్సై హెచ్చరించారు ఈ తనిఖీలు లోహెడ్ కానిస్టేబుల్ రవి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు

## 45వ వార్డు ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్



**మిర్యాలగూడ మార్చి 12:- (ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ మునిసిపల్ 45వ వార్డు షాబునగర్ లో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక మున్సిపల్ కార్యక్రమంలో భాగంగా గురువారం మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలుని బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ కుటుంబం, వార్డు సభ్యులతో శాలువాతో చిరు సన్మానించారు. కార్యక్రమంలో 45వ వార్డ్ కౌన్సిలర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, సామాజిక వేత్త పోలా యాదయ్య,ఆవుదారపు మురళి ముదిరాజ్, ఉబ్బపల్లి కాశయ్య, , బంటు విజయలక్ష్మి -వెంకటేశ్వర్లు ముదిరాజ్, నక్క పద్మ, ఖాజా, పోలా హైమావతి, దోనేటి ఆశోక్, కోలా రాంబాబు ముదిరాజ్, బంటు హన్మంత్, బంటు మేఘనలు పాల్గొన్నారు.

## కేంద్రం గ్యాస్ సిలిండర్ ధర,బుకింగ్ 25 రోజులకు పెంచడం సబబు కాదు



మిర్యాలగూడ, మార్చి 12:- (ప్రభాత సూర్య) : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ కొరత లేదంటూనే బుకింగ్ మాత్రం జరగడం లేదని, ధర సిలిండర్ కు రూ.68లు దారుణమని సామాన్యుల పరిస్థితి ఏం కావాలని కాంగ్రెస్ నాయకులు గుగులోతు శారద ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ ఇరాన్ -ఇజ్రాయెల్ యుద్ధం భారత దేశం ప్రభావం లేదంటూనే గ్యాస్ బుకింగ్ కు అవకాశం కల్పించడం లేదని ఆరోపించారు. అదేవిధంగా గతంలో 21 రోజులకు బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా 25 రోజులకు పెంచారని విమర్శించారు. మహిళలు కట్టెల పొయ్యితో కళ్లు పోగొట్టుకుంటున్నారని గ్యాస్ వాడాలని అలవాటు చేసి నేడు ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సబబని ఆమె ప్రశ్నించారు. పెంచిన ధర తగ్గించాలని, ఏది ఏమైనా సామాన్యులకు వంట గ్యాస్ సిలిండర్ అందుబాటులోకి తీసుకు రావాలని ఆమె కోరారు.

# రాజకీయంగా ఎదుర్కోలేక అసత్య ప్రచారాలు..

## దమ్ముంటే నన్ను రాజకీయంగా ఎదుర్కొండి.. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య..



**ఆలేరు మార్చి 12 ప్రతిభ సూర్య:** ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల మాట్లాడుతూ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందాలు చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.ఆలేరు లో కొన్ని ఇళ్లు, భూములను నిషేధిత జాబితాలో చేర్చారని చెప్పి ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిషేధిత జాబితాలో ఉన్న ఇండ్లు ,భూములను ప్రభుత్వం కూల్చివేయడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ చేయదని స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితి వస్తే పూర్తి బాధ్యత తనదేనని ఆయన తెలిపారు.నిషేధిత జాబితా చూసి ప్రజలు అధైర్యపడవద్దని, వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించి నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్లకు క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకునేలా మాట్లాడతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అక్రమంగా ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములను కబ్జా చేసిన వారిని కట్టడి చేయడానికే 22వా యాక్ట్ 1908 వర్తిస్తుందని తెలిపారు. సాధారణ ప్రజల ఇళ్లపై బుల్డోజర్లు వస్తాయని ప్రచారం చేయడం పూర్తిగా తప్పుదారి పట్టించే చర్య అని అన్నారు.ఆలేరు పట్టణంలో ఒక గుంట భూమి కూడా ప్రజల నుంచి ప్రభుత్వం తీసుకునే ఉద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. పన్నుల రూపంలో సేకరించిన డబ్బులను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తున్నామని, అప్పుల భారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ధైర్యంగా ఉండాలని, తాను ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్, మండల అధ్యక్షుడు కొండరాజు వేంకటేశ్వర రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదికొండ శ్రీకాంత్, చీర శ్రీశైలం, బీజన భాస్కర్, చింతలపాణి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెస్ విజయకుమార్, జెట్ట సిద్దులు, కర్రె అజయ్, ఎండి జైనుద్దీన్, దూడల రాజేందర్ గౌడ్, ఎండి గౌస్, ఎండి రఫీ, సుంకారి విక్రం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

## కోహెడ భూ బాధితులకు అండగా ఉంటాం.. భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్





**తుర్కయంజాల్,ప్రభాత సూర్య:** అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నిర్మాణం కోసం ప్రభుత్వం పేద ప్రజల భూములను ఆధీనంలోకి తీసుకోవడం అన్యాయమని భువనగిరి మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్య గౌడ్ అన్నారు.ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధిలోని కోహెడ రెవెన్యూ సర్వే నెంబర్ 167/1 లో భూములు కోల్పోయిన రైతులకు తుర్కయంజాల్ బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రైతులతో కలిసి భూములను పరిశీలించారు. అనంతరం మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఎస్సీ, బీసీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవడంతో రైతులు ఎంతో ఆవేదనకు గురవుతున్నారన్నారు.ఆ భూముల సాగుపైనే అధారపడి జీవిస్తున్న ఎంతో మంది రైతుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు భారతీయ జనతా పార్టీ ఏనాడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరిట రైతులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు తక్షణమే తగిన నష్టపరిహారం చెల్లించాలని, అలాగే హౌసింగ్ ప్లాట్స్ కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏ ఒక్క రైతు కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదని, రైతులకు న్యాయం జరిగే వరకు బిజెపి అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్త రామ్ రెడ్డి, బచిగళ్ళ రమేష్, కొండ్రు పురుషోత్తం, కందాల బల్దేవ్ రెడ్డి,కరాడి శ్రీలత అనిల్, బిక్షపతి, యూసుఫ్ రెడ్డి,నందగిరి సురేష్, గుండ కృష్ణ,ఎలిమేటి భరత్ రెడ్డి, విశాల్ గౌడ్,శివకుమార్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను సీసీ రోడ్డు ను ప్రారంభించిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్



**మిర్యాలగూడ మార్చి 12:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మండలం దుబ్బతండా గ్రామపంచాయతీ, కుంటకింది తండా గ్రామాలలో శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను, సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తునందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారులు ప్రజా ప్రభుత్వంపై చూపిస్తున్న ఆదరణకు కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడిగా గర్వపడుతున్నానన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక పథకాలు పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజా పాలన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి. స్కైలాబ్ నాయక్, రెడ్యానాయక్, గ్రామ సర్పంచ్ లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బిజెపి అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ కు శుభాకాంక్షలు...




**మియాపూర్ ప్రభాత సూర్య :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన రవి కుమార్ యాదవ్ ను మియాపూర్ డివిజన్ కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రవికుమార్ యాదవ్ బిజెపి పార్టీ కి చేసిన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు అధిష్టాన వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అండదండలతో మేము మరింత ఉత్సాహంగా పనిచేస్తామని గణేష్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు మరియు రాబోయే పార్టీ కార్యక్రమాలపై సవివరంగా చర్చించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వశీ దృష్టికి తీసుకెళ్లడంలో బీజేపీ నాయకులు ఎప్పటికప్పుడు ముందుండి పని చేస్తారని తెలిపారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని మరింత బలపరచడానికి కలిసి కట్టుగా పనిచేయాలని రవికుమార్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సారా రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కామ్రేడ్ విక్రమన్న వర్ధంతి నిర్వహణ

**ఏ ఐ కేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి**



**ఆలేరు, మార్చి 12: ప్రభాత సూర్య :** రాజ్య హింసను, నిర్బంధాలను ధిక్కరించి విప్లవోద్యమంలో వీరోచితంగా పోరాడిన కామ్రేడ్ విక్రమన్న (మందడి సత్తిరెడ్డి) 33వ వర్ధంతిని గురువారం ఆలేరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు–కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి మాట్లాడుతూ విప్లవోద్యమ నిర్మాణంలో కామ్రేడ్ విక్రమన్న పాత్ర విశిష్టమైందని తెలిపారు. అనేక ఆటుపోట్లను, రాజ్య హింసను, తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొంటూ అడవి ప్రాంత ఉద్యమాలకు, మైదాన ప్రాంత ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచారని అన్నారు. 1975లో జరిగిన (ఎమర్జెన్సీ) సమయంలో అలాగే అనంతరం ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధాలు అమలు చేసిన కాలంలో కూడా కామ్రేడ్ విక్రమన్న ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. అడవి ప్రాంతాల్లోని ఉద్యమాలకు సమాచారాన్ని చేరవేస్తూ, ఆత్మరక్షణ దళాలకు అవసరమైన సహకారం అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయుధాలను సరఫరా చేసే సమయంలో పోలీసులు అనేకసార్లు అరెస్టు చేయడానికి ప్రయత్నించినప్పటికీ చాకచక్యంగా తప్పించుకున్న ధైర్యసాహసి అని కొనియాడారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ (కొత్త ప్రజాస్వామ్యం) డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్ మాట్లాడుతూ బక్కగా కనిపించినప్పటికీ ఉక్కు క్రమశిక్షణ కలిగిన విప్లవ ప్రజా నాయకుడు కామ్రేడ్ విక్రమ్ సార్ అని పేర్కొన్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని ఆదివాసీలు, అడవి ప్రాంత ప్రజల సమస్యలను దగ్గరగా అధ్యయనం చేసి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేశారని చెప్పారు. “దున్నే వారికే భూమి” అనే నినాదంతో భూపోరాటాలను నడిపిన విప్లవ కమ్యూనిస్టుగా ఆయనను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్ధన్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చిరబోయిన రాజయ్య, పీఓడబ్ల్యూ (ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఉమెన్) జిల్లా అధ్యక్షురాలు ఆర్. సీత, ఐఎఫ్టీయూ (ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, టంగుటూరు మాజీ సర్పంచ్ కట్టా సమరసింహారెడ్డి, మందనపల్లి ఉప సర్పంచ్ పద్మ శశిరేఖ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రజా సంఘాల నాయకులు చిరబోయిన కొమురయ్య, ఆర్. ఉదయ్, కల్లెపు చంద్రయ్య, వంగాల నర్సింహారెడ్డి, కడకంచి సత్తయ్య, కొమ్మిడి గోపాల్ రెడ్డి, చింతకింది సత్యనారాయణ, కుర్రి సత్యనారాయణ, పాకాల సరిత, నరేష్, గోవింద్ పరమేశ్, కల్లెపు నర్సింహులు, ఆకుల కృష్ణ తదితరులు హాజరయ్యారు.



## ఘనంగా కాంగ్రెస్ నేత నరేష్ జన్మదిన వేడుకలు..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనిల్ కుమార్ యాదవ్ అనుచరుడు నరేష్ జన్మదినం సందర్భంగా గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనను కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా కార్యకర్తలు శాలువాల తో సత్కారించి కేక్ కట్ చేసి నరేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నరేష్ ఆయురారోగ్యాలతో పాటు పార్టీ లో మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్ ( టీంకు ) పవన్, అంబు, నాగరాజు, పిల్లి అనిల్, సాయి,పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 4వ రోజు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం

**పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి**



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 12(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామంలో 4వ రోజు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం భాగంగా 2వ వార్డ్ ,7వ వార్డ్ పాత, మురికి కాలువలు, రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు అనేకముగా ఉన్నాయి. గ్రామం శుభ్రం కోసం స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం 4వ రోజు ఏర్పాటుచేసి ప్రైవేట్ సిబ్బందితో శుభ్రం చేపిస్తున్న, నల్లాల బాయిని సందర్శించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు పందుల యాదగిరి గౌడ్ ,గునిగంటి రాజు, గ్రామపంచాయతీ కారోబార్ పున్నం యాదగిరి, గడ్డం గాలయ్య, పుచ్చుల కృష్ణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే సమక్షంలో పెళ్లిరోజు జరుపుకున్న పొలిమేర పరమేష్ సంగీత దంపతులు



**చిట్యాల,మార్చి 12(ప్రభాత సూర్య)::** చిట్యాల మండలం చిన్న కాపర్తి గ్రామానికి చెందినకాంగ్రెస్ పార్టీ నాయకుడు పొలిమేర పరమేష్ సంగీత దంపతులు పెళ్లి రోజు వేడుకలు నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం సమక్షంలో కేక్ కటింగ్ చేయించుకొని , ఆశీర్వాదం తీసుకొని పెళ్లిరోజు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చినకాపర్తి సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## కళలు, నాటక కళలు కనుమరుగు కాకుండా
# ఉచిత నటన తరగతులు ప్రారంభించాలి

**రైస్ మిల్లర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్**





**మిర్యాలగూడ, మార్చి:- 12 (ప్రభాత సూర్య ):** నాటక కళలను జీవింప జేసేందుకు ఉచిత నటన శిక్షణ తరగతులు నిర్వహించాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ కోరారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న నందినీ అవార్డ్స్– 2026 జాతీయస్థాయి పద్య నాటక సాంఘిక నాటక పోటీలు నృత్యోత్సవాలు నాలుగో రోజు గురువారం ప్రముఖపారిశ్రామికవేత్తలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, బండారు కుశలయ్య, మిల్లర్స్ మిర్యాలగూడ ఉపాధ్యక్షులు గోళ్ళ రామశేఖర్ లు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నాటక రంగంలో దినదినాభివృద్ధి చెందుతూ ఢిల్లీకి చేరిన మిర్యాలగూడ ఖ్యాతి దీనికి విశేష కృషి చేస్తున్న మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ళ రామచంద్రరావు ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ, కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ శ్రమ వెలకట్టలేనిదన్నారు. మిర్యాలగూడకు ఇంతటి ఖ్యాతిని అందించిన కళాకారులకు ఏమిచ్చినా తక్కువే అవుతుందన్నారు. అందుకు మా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ముందుగా పాటల పోటీలను నిర్వహించి చెరిగిపోని చిరునామ సాంఘిక నాటిక హర్ష క్రియేషన్స్, విజయవాడ, నీళ్ళు నీళ్ళ సాంఘిక నాటిక నటరాజ డ్రమటిక అసోసియేషన్, పెందుర్తి, విశాఖపట్నం, వివాహ బంధం సాంఘిక నాటిక మయూరి ఆర్ట్స్ క్రియేషన్స్, వరంగల్ వారిచే నాటికలను ప్రదర్శించారు. నటీనటులకు నిర్వాహకులకు పారితోషకం, షీల్డులు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ళ రామచంద్రరావు, అధ్యక్షులు పి.రామావతారం, ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తి శర్మ, కోశాధికారి వెంకటలక్ష్మీనారాయణ శర్మ, సాయిలు, సత్యనారాయణ చారి, లక్ష్మయ్య, ఎల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాఘవయ్య, శైలజ, సరస్వతి, నాగమణి, ఉపేందర్, బాబురావు, వీరప్రతాప్ పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలలో గ్రామపంచాయతీ కార్మికులసమస్యలపై చర్చించాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు**

**నర్సాపూర్ ఎం.ఎల్.ఏ కార్యాలయం లో వినతి పత్రం. అందజేత.**



**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి12:** గత ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఈ అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని,సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పై అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే సునీత రెడ్డి చర్చించాలని కోరుతూ గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే సునీత లక్ష్మ రెడ్డి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి నెల ఐదో తారీకు లోపు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇస్తామని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, జీతాల పెంపుదల ఉద్యోగ భద్రత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీల ను ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు. గత మూడు నెలల నుంచ జీతాలు రాక కార్మికులు అర్ధ ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించా లని, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించా లని అన్నారు .గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పై అసెంబ్లీ సమావేశాలలో స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి చర్చించాలని వినతి పత్రం ఇచ్చినట్లు ఆయన తెలిపారు . మార్చి 17 వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ పి వి టీకా బిడ్డలకు రక్షణ కవచం: ఎమ్మెల్యే సునీత రెడ్డి

**ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ పి వి టీకా ప్రారంభోత్సవం**




**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి 12:** హెచ్ పి వి వ్యాక్సిన్ భవిష్యత్తులో ఆడపిల్లలకు రక్షణ కవచము లాంటిదని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే సునీత రెడ్డి, హెచ్ పీవీ వ్యాక్సిన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ పి వి వ్యాక్సిన్ ను ప్రారంభించడం సంతోషించ దగ్గర విషయం అన్నారు. భవిష్యత్తులోఆడపిల్లల కు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గర్భాశయ క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్త చర్యగా ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇప్పించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ పి వి వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆడబిడ్డలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత రెడ్డి తో పాటు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పావని, డాక్టర్ రాజేష్, ఆసుపత్రి సిబ్బంది, పి హెచ్ సి డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## పటాన్చెరు డివిజన్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష

ఎన్ఆర్‌పి కాలనీలో డ్రైనేజీ, బండ్లగూడలో సీసీ రహదారి నిర్మాణ పనుల పరిశీలన



**పటాన్చెరు, మార్చి 12,ప్రభాత సూర్య :** పటాన్చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పరిశీలించారు. జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్ఆర్‌పి కాలనీలో పర్యటించి నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను సమీక్షించారు.అనంతరం జేపీ కాలనీలోని బండ్లగూడ కాలనీలో నిర్మాణంలో ఉన్న సీసీ రహదారి పనులను పరిశీలించారు. రహదారి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో బండ్లగూడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భరత్ కుమార్, గొల్ల కృష్ణ యాదవ్, లక్ష్మణ్, శేఖర్, సంబంధిత శాఖల సిబ్బంది మహేష్, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి నిత్యవసర సరుకుల పంపిణీ



**తుర్కపల్లి, మార్చి 12 ప్రభాతసూర్య:** తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏషబోయిన అంజమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి శ్రీ పలుగుల మైసమ్మ సిఐటియు పెయింటర్ యూనియన్ తరపున 50 కిలోల బియ్యం, గణపతి పెయింటింగ్ షాప్ వినీత్ తరపున 5 కేజీల మంచి నూనెను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మేడిపల్లి రాజు, ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ గౌడ్ జనరల్ సెక్రెటరీ శ్రీశైలం, రాజు, సత్యనారాయణ ,క్రాంతి కుమార్,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## శిక్షణ శిబిరలో చౌటుప్పల్ కౌన్సిలర్ల హాజరు



**చౌటుప్పల్,మార్చి 12, ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రజా పాలన- ప్రగతిప్రాణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక లో భాగంగా పట్టణ కేంద్రంలోని వి- కన్వెన్షన్,న్యూ వివేరా లో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లకు నిర్వహించిన ఒక్కరోజు అవగాహన శిక్షణ శిబిరంలో చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన వివిధ వార్డుల కౌన్సిలర్లు గురువారం హాజరైనారు . ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొని.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవారికి అమలు చేసేలా చూడాలన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ పాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అధికారుల ద్వారా అవగాహన కల్పించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర, మున్సిపల్ నిధుల వినియోగం, పారిశుద్ధ్యం, పట్టణ అభివృద్ధి వంటి విషయాలపై వివరించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న చౌటుప్పల్ కౌన్సిలర్లు తమ వార్డుల అభివృద్ధికి ఈ అవగాహన ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కరరావు, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లు, అధికారులు పాల్గొన్నారు.





# లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్

### స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్,ఎస్పీ, శాసనసభ్యులు

**యాదాద్రి జిల్లా, మార్చి 12, ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ్మస్వామి పుణ్యక్షేత్రాన్ని గురువారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు.రాష్ట్ర గవర్నర్ కు ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి,రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి గవర్నర్ కు పూల మొక్కలు బహుకరించి స్వాగతం పలికారు.తొలుత రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం



స్వీకరించారు. వేద పండితులు,అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి భావానీ శంకర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయంతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజ స్తంభం వద్ద మొక్కి స్వామి వారి అంతరాలయంలో అర్చన పూజలు నిర్వహించారు.కార్య నిర్వాహణాధికారి స్వామి వారి మెమొంటోను అందచేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామి వారి ప్రసాదాన్ని గవర్నర్ కు అందచేశారు.అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిణి సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్పటిక లింగానికి గవర్నర్ దంపతులు అభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# ఎంఎం హైటెక్ స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

### ఎంఐఎం ఎమ్మెల్సీమీర్జా రియాజుల్ హసన్



**నల్గొండ ప్రభాత సూర్య:** నల్గొండ జిల్లా కేంద్రంలోని హైటెక్ కాలనీలో ఎం ఎం హైటెక్ స్విమ్మింగ్ పూల్ ఘనంగా ప్రారంభం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎంఐఎం హైదరాబాద్ ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండిహాజరై ప్రారంభించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆధునిక సదుపాయాలతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు మీర్జా మహమ్మద్ బేగ్ ఆదిల్ ఆధ్వర్యంలో నిర్మాణం చేసి ప్రారంభోత్సవం నిర్వహణ పట్టణ ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అతిథుల సూచన ప్రత్యేకంగా శిక్షణ పొందిన ట్రైనర్ల ద్వారా పిల్లలు,యువతకు స్విమ్మింగ్ ట్రైనింగ్ అందించనున్నట్లు నిర్వాహకుల ప్రకటన కార్యక్రమంలో నల్గొండ డిప్యూటీ మేయర్ ఆమర్,ఎంఐఎం కార్పొరేటర్లు మోయినా భాయ్, రఫీ ఉద్దీన్ హాజీ, నదీమ్ హాజరు. కాంగ్రెస్ కార్పొరేటర్లు సమద్, ఇబ్రహీం, ఇర్ఫాన్, ఖలీల్, ఏఐఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ రజియోద్దీన్, హ్యూమన్ రైట్స్ ఆక్టివ్ మెంబర్ మొహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు

## ముస్లీంలను ఓట్ బ్యాంకుగా చూస్తున్న కాంగ్రెస్

### ఎమ్మెల్యే తల సాని శ్రీనివాస్‌యాదవ్

సికింద్రాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లీం లను ఓటు బ్యాంకు లా చూస్తుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బుధవారం సాయంత్రం మోండా డివిజన్ లోని ఇస్లామియా మజీద్ లో ముస్లీం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాసం (రోజా) చేపట్టిన ముస్లీం సోదరులకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులు నెలరోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉదయం నుండి సాయంత్రం వరకు ఉపవాస దీక్షలు చేపడతారని పేర్కొన్నారు. సాయంత్రం దీక్షలు ముగిసిన అనంతరం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. ఈరోజు ఇఫ్తార్ ఏర్పాటు చేసిన ఆయూబ్, ఆసీఫ్ లను ఆయన అభినందించారు. కేసీఆర్ ప్రభుత్వం రంజాన్ సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు లు ఏర్పాటు చేయడమే కాకుండా, రంజాన్ కిట్ ల క్రింద నూతన దుస్తులను అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా రంజాన్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో మసీదు లు, ఈద్గా ల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మౌలానా, ఇమామ్ లకు గౌరవ వేతనం ఇచ్చిన ఘనత కూడా కెసిఆర్ ప్రభుత్వానిదేనని వివరించారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లీం లను పట్టించుకోవడం లేదని, తమ ప్రభుత్వం అమలు చేసిన అన్ని కార్యక్రమాలు తుంగలో తొక్కిందని విమర్శించారు.

# రాజకీయంగా ఎదుర్కోలేక అసత్య ప్రచారాలు..

## దమ్ముంటే నన్ను రాజకీయంగా ఎదుర్కొండి.. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య..



**ఆలేరు మార్చి 12 ప్రతిభ సూర్య.:** ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల మాట్లాడుతూ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందాలు చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.ఆలేరు లో కొన్ని ఇళ్లు, భూములను నిషేధిత జాబితాలో చేర్చారని చెప్పి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిషేధిత జాబితాలో ఉన్న ఇండ్లు ,భూములను ప్రభుత్వం కూల్చివేయడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ చేయదని స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితి వస్తే పూర్తి బాధ్యత తనదేనని ఆయన తెలిపారు.నిషేధిత జాబితా చూసి ప్రజలు అధైర్యపడవద్దని, వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించి నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్లకు క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకునేలా మాట్లాడతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అక్రమంగా ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములను కబ్జా చేసిన వారిని కట్టడి చేయడానికే 22ఏ యాక్ట్ 1908 వర్తిస్తుందని తెలిపారు. సాధారణ ప్రజల ఇళ్లపై బుల్డోజర్లు వస్తాయని ప్రచారం చేయడం పూర్తిగా తప్పుదారి పట్టించే చర్య అని అన్నారు.ఆలేరు పట్టణంలో ఒక గుంట భూమి కూడా ప్రజల నుంచి ప్రభుత్వం తీసుకునే ఉద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. పన్నుల రూపంలో సేకరించిన డబ్బులను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తున్నామని, అప్పుల భారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ధైర్యంగా ఉండాలని, తాను ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులు దమ్ము ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులకు కూడా ఇందిరం ఇండ్లును మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో పోరాడాలి తప్ప ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి దుష్ప్రచారం ఆపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్, మండల అధ్యక్షుడు కొండరాజు వేంకటేశ్వర రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదికొండ శ్రీకాంత్, చీర శ్రీశైలం, బీజన భాస్కర్, చింతలపాణి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెస్ విజయకుమార్, జెట్ట సిద్దులు, కర్రె అజయ్, ఎండి జైనుద్దీన్, దూడల రాజేందర్ గౌడ్, ఎండి గౌస్, ఎండి రఫీ, సుంకారి విక్రం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి







### ప్రజా ప్రతినిధులు జిల్లాను అభివృద్ధిలో ముందుంచాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

### ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,

### ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న: జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్

**యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చి 12, ప్రభాత సూర్య :** ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు గ్రామాలలో, వార్డులలో అందించి జిల్లాను అభివృద్ధిలో ముందు ఉంచాల్సిన బాధ్యత సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లపై ఉందని .... ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని వి- కన్వెన్షన్, న్యూ వివేరా లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచులకు, చైర్ పర్సన్ లకు ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా రాష్ట్ర గేయం వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

**ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలి : ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతుందని , సర్పంచులు, వార్డు మెంబర్లు, చైర్ పర్సన్ లు గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవారికి అమలు చేసేలా చూడాలన్నారు. గత రెండు సంవత్సరాల వ్యవధిలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు ,200 యూనిట్లు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని గ్రామాలను అందంగా తీర్చిదిద్దే విధంగా పనులు చేపట్టాలన్నారు. అవసరమైన నీరును ఆలేరు నియోజకవర్గంలో అన్ని చెరువులు నింపడం జరిగిందన్నారు. రాబోవు కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి గ్రామాలలో, పట్టణాలలో నీటి ఎద్దటి లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు.

**ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి :ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

ఎమ్మెల్సీ చింతపండు నవీన్ మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యశరణ ప్రణాళికను నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు సర్పంచులు అవగాహన కలిగి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని, ఐదు సంవత్సరాల పాలనకు మంచి సహకారం ప్రజలకు అందించాలన్నారు. ప్రజలు మెచ్చేలా అభివృద్ధి పనులు గ్రామాలలో, పట్టణాలలో చేపట్టాలున్నారు. ప్రభుత్వ పథకాలను అవగాహన చేసుకుని వాటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో తెలుసుకొని గ్రామాలు అభివృద్ధి పథంలో ఉంచాలన్నారు.

**ప్రజలు మెచ్చినట్లుగా సేవలు అందించాలి : ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచులు వార్డు మెంబర్లు ప్రజలకు ఏ సమస్య ఉందో తెలుసుకుని వారికి అవసరమైన సాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు ,ఇతర అభివృద్ధి పనులను గ్రామాలలో చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అవుతున్నందున 5 ఏళ్ల పాలన సజావుగా నిర్వహించి ప్రజలకు మెచ్చి నచ్చి నట్టుగా సేవలు అందించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులు అర్హులైన ప్రతి పేదవారికి అందించే బాధ్యత గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు, చైర్ పర్సన్ లదేనని అన్నారు. సాగునీటికి అన్ని చెరువులను నింపుకున్నామని ఎక్కడైనా సమస్య ఉంటే అక్కడికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఏ సమస్య ఉన్న పరిష్కరించే బాధ్యత నాదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... గ్రామాలలో పారిశుధ్యం, పరిశుభ్రత పాటించినట్లయితే గ్రామాలు చాలా అందంగా తీర్చిదిద్దబడతాయని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా 10 ప్రధాన అంశాలను గ్రామాలలో, వార్డులలో సమస్యలు తీర్చి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న ఫైల్స్ క్లియర్ చేయడం జరుగుతుందన్నారు. నీటి ఎద్దడి లేకుండా ఎండలు దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికలు వేసుకొని మీ మీ గ్రామాలలో సమస్యలు పరిష్కరించా లన్నారు. గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు ప్రజలకు అన్ని సదుపాయాలను గ్రామాలలో, పట్టణాలలో అభివృద్ధి పనులు చేపట్టి స్వయం సభివృద్ధి సాధించే విధంగా కృషి చేయాలన్నారు.

**తరతరాలు గుర్తుండేలా అభివృద్ధి జరగాలి : దివ్య దేవరాజన్**

సెర్ప్ సి.ఈ. ఓ, పంచాయతీ రాజ్ కమీషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. ప్రతి మండలంలో ప్రజా పాలన వచ్చినప్పటినుండి ఎన్నో అభివృద్ధిలు చేపట్టామన్నారు. తరతరాలుగా గుర్తుండే విధముగా అభివృద్ధి పనులు చేయాలన్నారు. కొత్తగా ఎన్నికైన వారికి ఒక స్ఫూర్తిని ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పట్టుదలతో అభివృద్ధి పనులు చేపడితే ఎలా అయినా విజయం సాధించవచ్చన్నారు. దానికి సంబంధించిన ప్రణాళికలు వేసుకోవాలని, గ్రామాలలో వార్డులలో కానీ గెలుపొందిన వారు మార్పు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నుండి 15వ ఫైనాన్స్ కమిషన్ ఫండ్ కూడా ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని, అట్టి నిధులు గ్రామాలలో, కానీ పట్టణాల్లో కానీ దీనికి ఉపయోగిస్తే ప్రజలకు ఉపయోగపడుతుందని ప్రణాళిక వేసుకొని నిధులు వృధా చేయకుండా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాలలో నూతన అంగన్వాడీ, తదితర అవసరమైన భవనాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. పచ్చదనం స్వచ్ఛందనంగా గ్రామాలు తీర్చిదిద్ది, శానిటేషన్ విధులు నిర్వహించే సిబ్బంది మంచిగా పని చేస్తే గ్రామం మంచిగా తీర్చిదిద్దుతారని అన్నారు. గ్రామాలు,పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

**శిక్షణ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ..,99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గురించి అవసరమైన అవగాహన అందించేందుకు నూతన వార్డు సర్పంచులు, వార్డ్ మెంబర్లు, చైర్ పర్సన్ లు లకు ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలను , పట్టణాలను అందంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, లబ్దిదారుల ఎంపిక, ప్రభుత్వ పని తీరు లో వచ్చిన మార్పుల గురించి తెలుసుకోవాలన్నారు.ప్రతి శాఖ సంబంధించి పని తీరు ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమంలో తెలుస్తుందని, ప్రజా ప్రతినిధులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు.

**ఎదుగుతున్న పిల్లలకు విధిగా అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పీ**

యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా జిల్లాలో ప్రమాద నివారణకు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గ్రామాలలో పట్టణాలలో రాష్ డ్రైవింగ్, వేరే హెల్మెట్,నో డ్రగ్స్ తదితర అంశాల గురించి ప్రజలకు ,ముఖ్యంగా ఎదుగుతున్న పిల్లలకు విధిగా అవగాహన కల్పించాలన్నారు.ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లాలోని అన్ని మండలాల చైర్మన్లు, వార్డు మెంబర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన డాక్టర్ నీలం ఇంజెటికి పీహెచ్.డీ

**పటాన్చెరు, మార్చి 12,ప్రభాత సూర్య :** మండలం లోని ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని నీలం ఇంజెటిని డాక్టరేట్ వరించింది. 'ప్రయోగాత్మక జంతువులలో నాడీ సంబంధిత రుగ్మతలకు వ్యతిరేకంగా సంభావ్య మూలికల యొక్క న్యూరోప్రొటెక్టివ్ ప్రభావం' అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన అల్జీమర్స్ వ్యాధిని పరిష్కరించడంలో ఔషధ మొక్కల యొక్క న్యూరోప్రొటెక్టివ్ సామర్థ్యాన్ని అన్వేషించినట్టు తెలియజేశారు. సాంప్రదాయకంగా మూలికా వైద్యంలో ఉపయోగిం చే మొక్కలైన ఇండిగోఫెరా ప్రోస్ట్రాటా, లాంటానా కమారా యొక్క ఫైటోకెమికల్, చికిత్సా లక్షణాలపై ఈ అధ్యయనం దృష్టి సారించిందన్నారు. సిలికో మాలిక్యులర్ డాకింగ్, జీసీ-ఎంఎస్ విశ్లేషణ, ప్రయోగాత్మక జంతు అధ్యయనాలలో అధునాతనమైన పురోగతి ద్వారా, పరిశోధన అమిలాయిడ్-బీటా, ఎసిటైల్ కోలినెస్టెరేస్ తో సహా కీలకమైన అల్జీమర్స్ వ్యాధి లక్షణాలతో మొక్కల నుంచి ఉత్పన్నమైన సమ్మేళనాల యొక్క ఆశాజనక పరస్పర చర్యలను ప్రదర్శించినట్టు వివరించారు. ప్రయోగాత్మక నమూనాలలో గణనీయమైన యాంటీఆక్సిడెంట్ కార్యకలాపాలు, జ్ఞాపకశక్తి, అభ్యాసంలో మెరుగుదల



కూడా ఈ పరిశోధన ఫలితాలు తేల్చాయని, ఇది మొక్కల బలమైన న్యూరోప్రొటెక్టివ్ సామర్థ్యాన్ని వెల్లడిస్తోందన్నారు. ఈ మూలికా వనరులు అల్జీమర్స్ వ్యాధికి కొత్త చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడతాయని, తదుపరి క్లినికల్ పరిశోధనలను ప్రోత్సహిస్తాయని అధ్యయనం సూచిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ నీలం సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మాజీ ఎంపీటీసీ ఎండి జైనోద్దీన్ జన్మదిన వేడుకలు..

**మార్చి 12 ప్రతిభ సూర్య..** మాజీ ఎంపీటీసీ ఎండి జైనోద్దీన్ జన్మదిన సందర్భంగా ఆలేరు కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా జన్మదినం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బిర్లా ఐలయ్య వారిని శాలువతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# కొత్త డీజీపీ ఎవరు...

తెలంగాణకు పూర్తిస్థాయి డీజీపీ ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేడు ఢిల్లీలో యూపీఎస్సీ కమిటీ సమావేశమై రాష్ట్రం పంపిన ఐదుగురు ఐపీఎస్‌ల నుంచి ముగ్గురి పేర్లను ఖరారు చేయనుంది. సీనియారిటీలో సీవీ ఆనంద్ ముందుండగా.. మహిళా అధికారికి అవకాశం ఇవ్వాలనుకుంటే శిఖాగోయల్, సౌమ్యా మిశ్రాల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. యూపీఎస్సీ పంపే ముగ్గురి జాబితా నుంచి ప్రభుత్వం ఒకరిని ఎంపిక చేస్తుంది.తెలంగాణకు ఇప్పటి వరకు పూర్తికాలపు డీజీపీ లేరు. ప్రస్తుతం శివధర్ రెడ్డి ఇంఛార్జ్ డీజీపీగానే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి పూర్తికాలపు డీజీపీ ఎంపిక ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. యూపీఎస్సీ నేతృత్వంలోని కమిటీ ముగ్గురు అర్హత కలిగిన సీనియర్ ఐపీఎస్‌ల జాబితాను ఖరారు చేసేందుకు నేడు సమావేశం కానుంది. యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ భేటీకి కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర సాయుధ పోలీస్ బలగాల హెడ్, రాష్ట్రం నుంచి సీఎస్ రామకృష్ణారావు సభ్యుల హోదాలో అటెండ్ కానున్నారు. తెలంగాణకు పూర్తికాలపు డీజీపీ లేకపోటవంతో డీజీపీ ఎంపికకు తుది జాబితాను యూపీఎస్సీకి పంపించాలని సుప్రీంకోర్టు గత నెల 5న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ క్రమంలోనే గత నెల 23న రేవంత్ సర్కార్ అర్హుల జాబితాను పంపించింది. ఈ జాబితా ఐదుగురి పేర్లతో ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డితో పాటు, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ , 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్‌ఆప్టే, శిఖాగోయెల్, సౌమ్యమిశ్రా తెలంగాణ క్యాడర్‌లో డీజీపీ హోదా కలిగిన ఐపీఎస్‌లుగా ఉన్నారు. వీరి పేర్లను యూపీఎస్సీకి పంపించినట్లు సమాచారం. నేటి యూపీఎస్సీ కమిటీ భేటీలో వీరిలో ముగ్గురి పేర్లను ఖరారు చేయనున్నట్లు తెలిసిందే. సీనియారిటీ, మెరిట్ ఆధారంగా ఎంపికయ్యే వారి జాబితాను యూపీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనుండగా.. వారిలో నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఒకరిని డీజీపీగా ఎంపిక చేయనుంది.ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీవీ ఆనంద్ అందరికంటే సీనియర్. ఆ తర్వాత 1994 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత ఇన్‌చార్జి డీజీపీ శివధర్ రెడ్డి, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేస్తున్న శిఖా గోయల్, జైళ్లశాఖ డీజీగా పనిచేస్తున్న సౌమ్యా మిశ్రా, కేంద్ర సర్వీస్‌లో ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే ఉన్నారు. సీనియర్ ఐపీఎస్ అయిన సీవీ ఆనంద్ వైపు రేవంత్ ప్రభుత్వం మొగ్గు చూపుతుందా..? లేదంటే మహిళకు ఆ పోస్టు ఇస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.మహిళకు ఛాన్స్ ఇవ్వాలనుకుంటే శిఖాగోయల్, సౌమ్యా మిశ్రాలలో ఒకరికి అవకాశం దక్కనుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.